



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 310 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 26-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు

### కేంద్రం చర్యను తప్పుపట్టిన ప్రియాంక



న్యూఢిల్లీ

ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ యువ నేతలు భారత్- అమెరికా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. సమ్మిట్‌లో నిరసన చేసిన కాంగ్రెస్ నేతల్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టు సిగ్గుచేటని ఆమె ధ్వజమెత్తారు. 'సత్యం కోసం, శాంతియుత, అహింసాయుత ప్రతిఘటన మనం గర్వించదగిన వారసత్వం. ఇది మహాత్మాగాంధీ, లక్షలాది మంది భారతీయుల పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలతో రాజీపడిన ప్రధానికి, ఆయన ప్రభుత్వానికి

-మిగతా 2 లో

## ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండగా ఉన్నాం.

- ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగం గొప్ప గౌరవంగా భావిస్తున్నా
- భారత్, ఇజ్రాయెల్.. ప్రాచీన నాగరికత కలిగిన దేశాలు.
- ఇజ్రాయెల్‌తో 140 కోట్ల భారతీయుల స్నేహం, గౌరవం, భాగస్వామ్యం ఉంది
- ఇజ్రాయిల్ పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

2 లో



## పాక్‌లో ఆకాశాన్నంటిన పళ్ల ధరలు

- అరటిపళ్లు కిలో 300 పైమాటే
- ఒక కిలో బొప్పాయి 400 పాకిస్థానీ రూపాయలు
- భారత్‌లోని ధరలతో పోల్చుకుంటే పాక్‌లోని పళ్ల ధరలు ఎన్నో రెట్లు ఎక్కువ

లాహోర్,

పాకిస్థాన్ చాలా ఏళ్లుగా తీవ్ర ద్రవ్యోల్బణంతో సతమతమవుతోంది. ఆ దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు తార స్థాయికి చేరాయి. ముఖ్యంగా పళ్ల ధరలు భారీగా ఉన్నాయి. రంజాన్ వేళ పళ్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. పాకిస్థాన్‌లోని పండ్ల మార్కెట్‌కు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒక వ్లాగర్ పండ్ల మార్కెట్లోని ధరలను వెల్లడించాడు. భారతీయ వ్లాగర్ రిజ్వాన్ ఒక దుకాణదారుడిని పండ్ల ధర గురించి అడిగాడు. ముందుగా పాక్‌లో కిలో అరటిపళ్లు 300 నుంచి 400 పాక్ రూపాయల వరకు ఉన్నట్టు



-మిగతా 2 లో



# సీఎం రేవంత్‌తో అడోబ్ సీఈవో

### గ్లోబల్ ట్రెండ్స్ అవకాశాలపై చర్చ

- మ్యానుఫ్యాక్చరింగ్ పవర్ హబ్ గా తెలంగాణ
- రాష్ట్ర అభివృద్ధికి సహకరించాన్న రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగానూ శంతను కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ ట్రెండ్స్, కొత్త అవకాశాలతో రేవంత్‌తో చర్చించారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది.

-మిగతా 2 లో

# చిన్నారి కుటుంబానికి న్యాయం చేయండి

### కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ

- దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- తమకు న్యాయం చేయాలని చిన్నారి కుటుంబ సభ్యులు ఆందోళన
- రెండు నెలల పసిగుడ్డు ప్రాణాలు తీసిన హంతకులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలి
- యూనిఫామ్‌కి విలువ లేకుండా హంతకులను కాపాడే ప్రయత్నం పోలీసులు
- హంతకులు ఎవరైనా.. ఏ పార్టీవారైనా కచ్చితంగా శిక్షించాల్సిందే.
- పసిపాప కుటుంబానికి కెటిఆర్ పరామర్శ

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

నాగర్ కర్నూల్ జిల్లాలో ఇటీవల కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన గొడవలో రెండు నెలల చిన్నారి మృతిచెందిన ఘటనలో దోషులు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కెటిఆర్ పరామర్శించారు. తమకు న్యాయం చేయాలని చిన్నారి కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. బాధిత కుటుంబం ఆందోళన చేస్తున్న శిబిరం వద్దకి వెళ్లి వారితో మాట్లాడి ధైర్యం చెప్పారాయన. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఘోరాతి ఘోరమైన మానవత్వానికి మచ్చ తెచ్చే విధంగా చిన్నారిని హత్యచేశారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

-మిగతా 2 లో



బాధిత కుటుంబాన్ని కంటికి రెప్పల కాపాడు కుంటాం

## ఢిల్లీలో గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం

- బిష్ణోయ్ లీగల్ టీమ్‌పై కాల్పులు

న్యూఢిల్లీ,

దేశ రాజధానిలో మరోసారి గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం రేపాయి. తీహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ లీగల్ టీమ్‌ను లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటన ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో చోటుచేసుకుంది. లారెన్స్ బిష్ణోయ్ తరపున కోర్టు కేసులను వాదించే న్యాయవాదుల బృందం వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. బైక్‌పై వచ్చిన దుండగులు ఒక్కసారిగా లీగల్ టీమ్ వాహనంపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. అదృష్టవశాత్తూ

-మిగతా 2 లో



## సొంత భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు

- తహసిల్, ఆర్డీవో కార్యాలయాల నిర్మాణం
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్,ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

-మిగతా 2 లో



## గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి

- దేశాన్ని మరింత ధృడంగా నిర్మించడమే లక్ష్యం
- సాదాసీదా స్థాయి నుంచి సుదృఢ అమెరికాను నిర్మించా
- పౌరుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం
- ఇరాన్ అణు కార్యాక్రమాలతో అప్రమత్తంగా ఉన్నాం
- తన పాలనా ప్రయాణం యుగాలకు మలుపు
- స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ సుదీరఘ ప్రసంగం



వాషింగ్టన్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

అమెరికా గతంలో కన్నా దృఢంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇది అమెరికాకు స్వర్ణయుగం అని ఆయన వెల్లడించారు. మంగళవారం స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక కాలంగా అభివర్ణించారు. తన పరిపాలన ప్రయాణం.. యుగాలకు మలుపుగా ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థికాభి వృద్ధి పరుగులు

-మిగతా 2 లో

## వెలిగొండ పూర్తి కాకుండానే

# జగన్ రిబ్బన్ కట్

### పనులు పూర్తయ్యాయని దొంగమాటలతో మోసం



- వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా
- పనిచేసే ప్రభుత్వాని అండగా ఉండాలి
- ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేశా
- వెలిగొండ ప్రాజెక్టు పనులు పరిశీలించిన చంద్రబాబు

మార్కాపురం ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ పనులు పూర్తి అయ్యాయని జగన్ దొంగ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. పనులు పూర్తికాకుండానే జగన్ రిబ్బన్ కటింగ్ చేశారని సెటైర్లు గుప్పించారు. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు.


-మిగతా 2 లో

## ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే

- రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు నిజమే
- అయినా తానెలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడలేదు
- మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆవేదన

న్యూయార్క్

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ మరోసారి వార్తల్లో నిలిచారు. అమెరికా కోర్టు ఇటీవల విడుదల చేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ పత్రాల్లో బిల్ గేట్స్ పేరు ఉండటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ విషయమై ప్రపంచ టెక్ దిగ్గజం గేట్స్ మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో తనకున్న సంబంధాలపై స్పందించిన ఆయన.. తాజాగా ఆ రహస్య ఫైళ్ల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. కానీ తాను ఏనాడూ చట్టవిరుద్ధ పనులు చేయలేదని పేర్కొన్నారు. లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో గతంలో తనకున్న సంబంధాలపై స్పందిస్తూ గేట్స్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన దాతృత్వ సంస్థ 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' ఉద్యోగులతో నిర్వహించిన ఒక ప్రత్యేక భేటీ సందర్భంగా.. ఈ అంశంపై బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఎప్‌స్టీన్‌తో సమయం



-మిగతా 2 లో


## యూట్యూబర్ అన్వేష్ పై లుకౌట్ నోటీసులు

- విదేశాల్లో ఉండడంతో పంజాగుట్ట పోలీసుల వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

యూట్యూబర్ అన్వేష్ పై పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఆయన విడుదల చేసిన ఒక వీడియోలో అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా చేసిన ఆ వ్యాఖ్యలు సమాజంలో వివాదాస్పదంగా మారడంతో కేసు నమోదు చేసి విచారణ

-మిగతా 2 లో



## యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు

మొదటి తరువాయి

వ్యతిరేకంగా స్వరం పెంచడం 1.4 బిలియన్ల భారతీయుల ప్రయోజనాలకు మంచిది. ప్రజల గొంతును పెంచినందుకు యూత్ కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్య తీవ్రంగా ఖండించదగినది. సిగ్గుచేటైన విషయం. కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ యొక్క నిర్భయ సైనికులకు దృఢంగా అండగా నిలుస్తుంది ' అని ఆమె బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. చేశారు. అని ప్రియాంక ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఃూగా, ఎఐ సదస్సులో షర్ట్ విప్పి నిరసన తెలిపిన ఘటనకు కీలక సూత్రధారిగా భావించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదరు భాను చిబ్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఉదరు భానుతోపాటు మరో ఆరుగురు కాంగ్రెస్ కార్యకర్తల్ని అరెస్టు చేసి.. వారిపై అల్లర్లకు పాల్పడినట్లు పోలీసులు అభియోగాలు మోపారు.

## పాక్‌లో ఆకాశాన్నంటిన పళ్ల ధరలు

మొదటి తరువాయి

దుకాణదారుడు చెప్పాడు. అలాగే ఒక కిలో బొప్పాయి 400 పాకిస్థానీ రూపాయలని చెప్పడంతో వ్లాగర్ ఆశ్చర్యపోయాడు. ఇక, ఆపిల్స్, ఖర్జూరాల ధరలైతే మరింత భారీగా ఉన్నాయి. ఆపిల్స్ కిలోకు 500 రూపాయలు అని చెప్పాడు. ఖర్జూరాల ధర గురించి అడిగినప్పుడు, కిలోకు 1,200 పాకిస్తానీ రూపాయలు అని చెప్పి షాకిచ్చాడు పైన పేర్కొన్నవే కాదు.. చాలా పళ్లు కిలో లెక్కన కొనాలంటే కనీసం 300 పాక్ రూపాయలు చెల్లించాల్సిందే. భారత్‌లోని ధరలతో పోల్చుకుంటే పాక్‌లోని పళ్ల ధరలు ఎన్నో రెట్లు ఎక్కువ. ద్రవ్యోల్బణం పాక్‌లోని సాధారణ ప్రజలకు ఒక ప్రధాన సమస్యగా మారిపోయింది. పళ్లు మాత్రమే కాకుండా, పెట్రోల్, గ్యాస్ వంటి వాటి ధరలు కూడా భారీగా ఉన్నాయి. రోజువారీ జీవితం గడపడం సామాన్యులకు కష్టంగా మారిపోయింది.

## సిఎం రేవంత్‌తో అడోబ్ సీఈవో

మొదటి తరువాయి

ఏఐని సమర్థంగా వినియోగించుకునే విషయంపై శంతను నారాయణ్‌తో రేవంత్ చర్చించారు.ఛ

## ఢిల్లీలో గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం

మొదటి తరువాయి

ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది గ్యాంగ్ వార్‌లో భాగమా లేక లాయర్లను భయపెట్టడానికి చేసిన ప్రయత్నమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కాగా, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఇప్పటికే అనేక హై-ప్రొఫైల్ హత్యలు, బెదిరింపుల కేసుల్లో నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని లీగల్ టీమ్‌పై దాడి జరగడం సంచలనంగా మారింది.

## సొంత భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు

మొదటి తరువాయి

సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి అ÷–దదె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. మొదటి దశలో.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండో విడతలో.. శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేట్లు డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని వివరించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు.

## యూట్యూబర్ అన్వేష్ పై లుకౌట్ నోటీసులు

మొదటి తరువాయి

ప్రారంభించారు. ఈ వ్యవహారంపై స్పందించిన పంజాగుట్ట పోలీస్ అధికారులు, అన్వేష్ చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా అభ్యంతరకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన విదేశాల్లో ఉండడంతో దేశంలోకి ప్రవేశించిన వెంటనే అదుపులోకి తీసుకునేలా లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల అన్వేష్ తన సోషల్ మీడియా ద్వారా వీడియో విడుదల చేసి.. తనకు రెండు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, రెండు యూట్యూబ్ ఛానల్స్ ఉన్నాయని వెల్లడించారు. ఇందులో ఆయన ప్రధాన అకౌంట్‌ను ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేసినట్లు తెలిసింది. దీనిపై కూడా పోలీసులు దృష్టి సారించారు. ఈ కేసు దర్యాప్తు భాగంగా, అన్వేష్‌కు సంబంధించిన అకౌంట్ల వివరాలు, వీడియోల సమాచారం అందించాలని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలకు పోలీసులు అధికారికంగా లేఖ రాయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో చట్టవిరుద్ధ కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన పరిణామాలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే

మొదటి తరువాయి

గడపడం తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు అని ఆయన అంగీకరించారు. అలాగే రష్యన్ అమ్మాయిలతో సంబంధాలున్నాయంటూ తనపై వస్తోన్న ఆరోపణలపైనా గేట్స్ స్పష్టతనిచ్చారు. ఈ సమావేశంలో గేట్స్ తన తప్పును ఒప్పుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారని వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఎప్‌స్టీన్‌తో తన సంబంధాలపై గేట్స్ ప్రస్తావిస్తూ.. 2011-14 మధ్య కాలంలో ఎప్‌స్టీన్‌ను పలుమార్లు కలిసినట్టు అంగీకరించారు. అయితే.. ఆ సమయంలో అతడికున్న క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ గురించి అంత లోతుగా తనకు తెలియదన్నారు. తన మాజీ భార్య మెలిండా గేట్స్ మొదటి నుంచీ ఎప్‌స్టీన్ విషయంలో తనను హెచ్చరించిందని.. ఆ విషయంలో మెలిండాకు క్రెడిట్ ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు గేట్స్. ప్రస్తుతం జరుగుతున్న చర్చలను బట్టిచూస్తే.. నాడు తాను చేసిన పొరపాటు నేడు వందల రెట్లు పెద్దదిగా కనిపిస్తోందని ఆయన ఆవేదన చెందారు. 'ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం నాడు నేను చేసిన అతిపెద్ద తప్పు. గేట్స్ ఫౌండేషన్ కార్య నిర్వాహకులను అతడి సమావేశాలకు తీసుకురావడమూ తప్పే. నా పొరపాటు వల్ల ఈ వివాదంలో ఇరుక్కున్న ప్రతి ఒక్కరికీ నేను క్షమాపణలు చెబుతున్నాను. మా ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని గేట్స్ చెప్పినట్టు తెలిపింది. ఫౌండేషన్ ప్రతిష్ఠ చాలా సున్నితమైనదని.. ఇలాంటి సంఘటనలు తమతో కలిసి పనిచేసే ప్రజల నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని టెక్ దిగ్గజం ఆందోళన వ్యక్తం చేశారని అందులో పేర్కొంది. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన పత్రాల్లో.. ఎప్‌స్టీన్ రాసిన కొన్ని ఇ-మెయిల్ డ్రాఫ్టులు వెలుగులోకి వచ్చాయి. అందులో బిల్ గేట్స్‌కు డ్రగ్స్ సరఫరా చేయడం సహా రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు ఏర్పాటు చేసేందుకు తాను సహకరించానని ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. ఈ ఆరోపణలను నాటి నుంచీ గేట్స్ ఖండిస్తూనే ఉన్నారు. తాను ఎలాంటి చట్టవిరుద్ధమైన పనులు చేయలేదని స్పష్టం చేశారు. ఆ ఫొటోల్లో తన పక్కన ఉన్న మహిళలు ఎప్‌స్టీన్ సహాయకులు మాత్రమేనని.. కావాలనే వారి ముఖాలకు మాస్క్ వేశారన్నారు. అలాగే ఎప్‌స్టీన్ వేధింపులకు గురైన బాధితులతో తాను ఏనాడూ సమయం కేటాయించలేదని గేట్స్ చెప్పుకొచ్చారు.

### ఉగ్రవాదంపై పోరులో

# ఇజ్రాయెల్‌కు పూర్తి అండగా ఉన్నాం.

- ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగం గొప్ప గౌరవంగా భావిస్తున్నా
- భారత్, ఇజ్రాయెల్.. ప్రాచీన నాగరికత కలిగిన దేశాలు.
- ఇజ్రాయెల్‌తో 140 కోట్ల భారతీయుల స్నేహం, గౌరవం, భాగస్వామ్యం ఉంది
- ఇజ్రాయిల్ పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం



న్యూఢిల్లీ,

భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్ వెళ్లిన సంగతి తెలిసిందే. పర్యటనలో భాగంగా బుధవారం ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని తానేనని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'భారత్, ఇజ్రాయెల్.. ప్రాచీన నాగరికత కలిగిన దేశాలు. ఇజ్రాయెల్‌తో 140 కోట్ల భారతీయుల స్నేహం, గౌరవం, భాగస్వామ్యం ఉంది. ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండగా ఉన్నాం. ఉగ్రవాదంతో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నాం. ఉగ్రవాదానికి భారత్ పూర్తి వ్యతిరేకం. శాంతిస్థాపన అనేది అంత సులువైన విషయం కాదు. ఉనికి కోసం యూదులు అనేక కష్టాలు పడ్డారు'.. ఇజ్రాయెల్‌ను గుర్తించిన 1950లోనే నేనూ జన్మించా. ఇజ్రాయెల్‌తో భారత్‌కు చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ పౌరులను హమాస్ చంపడం దారుణం. ఇజ్రాయెల్ పౌరుల హత్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించం. పాలస్తీనా సమస్యలపై స్పందించాల్సిన సమయం వచ్చింది. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ వైఖరి వీడాలి. భారత్ ఎప్పుడూ చర్చలు, శాంతినే కోరుకుంటుంది' అని అన్నారు.

ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ పార్లమెంటులో ఘనస్వాగతం లభించింది. ఇజ్రాయెల్ పార్లమెంటు 'నెస్సెట్'ను ఉద్దేశించి మోదీ బుధవారంనాడు ప్రసంగించారు. పార్లమెంటు హాలులోకి మోదీ ప్రవేశించగానే సభ్యులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో మోదీకి స్వాగతం పలికారు. 'మోదీ... మోదీ' నినాదాలు హోరెత్తించారు. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు వంటి అత్యంత కీలక మిత్రదేశాల అధినేతలకు మత్రమే దక్కే ఈ అరుదైన గౌరవం భారత ప్రధానికి దక్కడం విశేషం. నెస్సెట్ స్పీకర్ అమిర్ ఒహానా మాట్లాడుతూ, నెస్సెట్ స్పీకర్‌గా సభలో ప్రసంగించనున్న తొలి ప్రధానిని ఆహ్వానించే అవకాశం దొరకడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. 'థాంక్యూ ప్రైమ్ మినిస్టర్ మోదీ' అంటూ హర్షాతిరేకం వ్యక్తం చేశారు.

## చిన్నారి కుటుంబానికి న్యాయం చేయండి

మొదటి తరువాయి

రెండు నెలల పసిగుడ్డు ప్రాణాలు తీసిన హంతకులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. మల్లన్న జాతరలో చిన్నారి తల్లి దర్శనం అడిగినందుకు ఆ పాపను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. దేవుడు దర్శనం అడిగిన పాపానికి.. దాడి చేసి మానవత్వానికే మచ్చ తెచ్చారని ఆగ్రహించారు. ఈ దారుణానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్ష పడాల్సిందేనని హెచ్చరించారు. పసిగుడ్డు ముఖం చూసి తండ్రిని వదలిపెట్టమని ప్రాధేయపడ్డ.. వదలకుండా కాలితో ఆ పాపను తన్నితే చనిపోయింది. యూనిఫామ్‌కి విలువ లేకుండా హంతకులను కాపాడే ప్రయత్నం పోలీసులు చేస్తున్నారు. రెండు నెలల పసిగుడ్డుకు కులం తెలుసా..?, మనుషులను చిన్నచూపు చూసి దర్శనానికి రానివ్వకుండా చేయడం ఘోరం. హంతకులు ఎవరైనా.. ఏ పార్టీవారైనా కచ్చితంగా శిక్షించాల్సిందే. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిది మందిని అరెస్టు చేయాల్సిందే. శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సిందే. పొత్తిళ్లలోని పసిగుడ్డును హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాల్సిందే. న్యాయం జరిగేదాకా పోరాటం ఆపకండి. దుర్మార్గులను శిక్షించేదాకా వదిలిపెట్టొద్దు. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిదిమందిపై హత్యానేరం మోపకపోతే శాసనసభలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. బాధిత కుటుంబాన్ని కంటికి రెప్పల కాపాడుకుంటాం. కులం, మతం లేదు.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా మేం అండగా ఉంటాం' అని కేటీఆర్ భరోసా కల్పించారు.

## గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి

మొదటి తరువాయి

పెడుతుందన్నారు. భవిష్యత్తులో దేశాన్ని మరింత మెరుగు పరుస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పునరుజ్జీవం, ఆర్థిక వృద్ధితోపాటు ప్రపంచ ప్రభావంపై దృష్టి సారించినట్లు డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ప్రపంచ స్థాయిలో అమెరికా మెరుగుపడిందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వరకు అమెరికా సాదాసీదాగా ఉండేదని.. కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలిచిందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం.. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను పురుషుల హాకీ ఒలింపిక్స్ విజేత కానర్ హెల్లెబ్యూక్‌కు ప్రదానం చేయనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత తొమ్మిది మాసాల్లో అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులు శాతం సున్నాకు చేరిందని పేర్కొన్నారు. 2028లో ఒలింపిక్స్‌కు అమెరికా వేదిక కానుందని ప్రకటించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పౌరుల సంక్షేమానికే తమ తొలి ప్రాధాన్యమన్నారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం కలిగిందన్నారు. అలాగే సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పూర్తిగా నిరోధించామని ట్రంప్ చెప్పారు. దేశంలోని ఆర్థిక అంశాల ను సైతం ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. గ్యాస్ ధరలు తగ్గించామని.. ఆ తర్వాత అంటే.. మూడు నెలల్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్నారు. తమ కొత్త స్నేహితుడు, భాగస్వామి అయిన వెనిజులా నుంచి 80మిలియన్ బ్యారెళ్ల చమురును తీసుకున్నామని ఆయన వివరించారు. ఇదంతా ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన నాటినుంచి నేటివరకు ఇది చోటు చేసుకుందన్నారు. దాంతో ఆమెరికా చమురు ఉత్పత్తి రోజుకు 60 వేల బ్యారెళ్ల మేర పెరిగిందని సోదాహరణగా విపులీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రతిజ్ఞ.. డ్రిల్, బేబీ, డ్రిల్‌ను ట్రంప్ ఉటంకించారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో ఉభయసభలను ఉద్దేశించి ఆయన అతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సుమారు గంటా 50 నిమిషాల పాటు ట్రంప్ మాట్లాడారు. తన ప్రసంగాల్లో ఇదే అతిసుదీర్ఘమైందిగా రికార్డుకెక్కింది. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అత్యధికంగా 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఇప్పుడు ఆ రికార్డును ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఏడాది మార్చిలో కూడా ట్రంప్ సుమారు 100 నిమిషాల పాటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా ఆర్థిక ఎజెండా గురించి ప్రస్తావించారు. ఇక ఇరాన్ అంశంలో వార్నింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఆ సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించేందుకు ఇష్టపడుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ అణ్వాయుధాలను సమీకరిస్తున్న ఇరాన్ వైఖరిని మాత్రం ట్రంప్ ఖండించారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ విరమించుకోవాలన్నారు. అమెరికాను తాకే క్షిపణులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కానీ దీనిపై ఆయన తన ప్రసంగంలో ఎటువంటి ఆధారాలను బయటపెట్టలేదు. యురోప్‌కు ప్రమాదంగా మారే కొన్ని మిస్సైల్స్‌ను ఇప్పటికే ఇరాన్ డెవలప్ చేసిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లను కూడా టా÷–గ్గ÷ట్ చేసే రేంజ్ ఇరాన్‌కు ఉందన్నారు. ఇక అమెరికా భూభాగానికి చేరుకునే స్థాయికి తగ్గ క్షిపణులను కూడా ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. మిడిల్ ఈస్ట్‌పై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ చేయడం వల్ల.. ఇరాన్‌తో యుద్ధానికి ఆ దేశం సిద్ధం అవుతుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తాము ఇచ్చిన డిమాండ్లను ఒకవేళ ఇరాన్ అంగీకరించకపోతే, అప్పుడు ట్రంప్ అనుకున్నంత పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడి చేశామని, ఆ దాడి వల్ల ఆ దేశ న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్ స్తంభించినట్లు ట్రంప్ చెప్పారు. న్యూక్లియర్ వెపన్ అంశంలో ఇరాన్ ఇంకా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. అణ్వాయుధాలను తయారు చేయమన్న వ్యాఖ్యలు ఇంకా ఇరాన్ నుంచి రావడం లేదన్నారు.

## వెలిగొండ పూర్తి కాకుండానే జగన్ రిబ్బన్ కట్

మొదటి తరువాయి

వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. బుధవారం మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మార్కాపురం జిల్లా ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఏపీకి పూర్వ వైభవం వస్తుందని వ్యాఖ్యానించారు. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పానని.. మాట నిలబెట్టుకున్నా నని, అలాగే మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని కోరారు. ఏపీకి మేలు చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కలిశామని ప్రస్తావించారు. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు కూటమిదే హవానని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాలో నూరుశాతం స్ట్రైక్‌రేట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా.. మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మదనపల్లెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా.. చేశానని ప్రస్తావించారు. మూడు వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చానని తెలిపారు. 1995లో మార్కాపురం ప్రజల కష్టాలు తాను చూశానని గుర్తుచేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించామని చెప్పారు. మార్కాపురం వెనుకబడిన ప్రాంతమని.. 1996 మార్చి 5వ తేదీన ఈ ప్రాంతానికి వచ్చానని.. ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీళ్లు కనిపించేవని గుర్తుచేశారు. తమకు శ్రీశైలం నీళ్లు కావాలని ఆనాడు ప్రజలు అడిగారన్నారు. కృష్ణా జలాలు తీసుకొస్తానని ఆరోజు మాట ఇచ్చానని.. వెలిగొండకు ఫౌండేషన్ తానే వేశానని.. పూర్తిచేసే అవకాశం తనకే వచ్చిందని పేర్కొన్నారు. ఒట్టి మాటలు చెప్పి మోసం చేయడం తనకు రాదని చెప్పుకొచ్చారు. 2014 వరకు వెలిగొండ పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. వెలిగొండతో 4 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. బుధవారం దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులని పరిశీలించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కెనాల్‌లో సీఎం చంద్రబాబు తిరిగారు. స్థానికంగా ఏఏ పంటలు పండిస్తున్నారో అన్నదాతలని అడిగి తెలుసుకున్నారు. లైనింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిలో వేగం పెంచాలని మార్గనిర్దేశర చేశారు. లలాగే, వెలిగొండ రెండో టన్నెల్‌లో పని చేస్తున్న ఇంజనీర్స్‌తో లైవ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టన్నెల్‌లో లైనింగ్ పనులని లైవ్‌లో పరిశీలించారు.

## శాతవాహన ఫార్మసీ అధ్యాపకురాలు అశ్వినికి దక్కిన అరుదైన గౌరవం



**కరీంనగర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: హైపర్‌టెన్షన్ నియంత్రణలో సాధారణ టాబ్లెట్లకు ప్రత్యామ్నాయంగా ప్రోనియోసోమ్స్ పద్ధతిపై చేసిన పరిశోధనకు గాను శాతవాహన ఫార్మసీ విభాగానికి చెందిన అధ్యాపకురాలు జె. అశ్వినికి అనురాగ్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది.ఫార్మాసీ విభాగ డీన్ డాక్టర్ వసుధా భక్షి పర్యవేక్షణలో ఫార్ములేషన్ డెవలప్మెంట్, ఆప్టిమైజేషన్ అండ్ ఇవాల్యూయేషన్ ఆఫ్ ప్రోనియోసోమ్స్ ఆఫ్ యాంటి హైపెర్టెన్సివ్ డ్రగ్స్ అంశంపై ఆమె పరిశోధన చేశారు.గత 12 సంవత్సరాలుగా శాతవాహన ఫార్మసీ కళాశాలలో అధ్యాపకురాలిగా, మహిళా విద్యార్థుల వార్డెన్‌గా సేవలందిస్తున్న అశ్విని, ఈ అవకాశాన్ని కల్పించిన యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## హోమ్ గార్డ్ కుటుంబానికి అండగా సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని మరోసారి నిరూపిస్తూ కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, సైదాపూర్ పోలీస్ స్టేషన్‌లో హోమ్ గార్డ్‌గా పనిచేస్తున్న శారద కుటుంబానికి హోమ్ గార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుండి రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేశారు.ఇటీవల విధులు ముగించుకుని భర్తతో కలిసి ఇంటికి వెళుండగా శారద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సీపీ వెంటనే స్పందించి, వైద్య ఖర్చులు మరియు అవసరాల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భీంరావు, రిజర్వు ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, జానిమియా, హెడ్ కానిస్టేబుల్ రవి తదితరులు పాల్గొన్నారు.

### అన్ని సంఘాలకు సమానహక్కులు కల్పించాలని బిఎంఎస్ కార్మిక సంఘం డిమాండ్



**గోదావరిఖని, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆర్‌జి--త్రీ ఏరియా ఏఎల్పీలో నిర్వహించిన వర్క్స్ కమిటీ సమావేశానికి కేవలం గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలను మాత్రమే పిలవడాన్ని బిఎంఎస్ కార్మిక సంఘం నిరసించింది. గత డిసెంబర్‌లో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినందున తదుపరి ఎన్నికలు జరిగే వరకు అన్ని సంఘాలను సమానంగా చూడాలని, అధికారిక కార్యక్రమాలకు అన్ని సంఘాలను పిలవాలని మేనేజర్‌కు మెమోరాండం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ మీనుగు సంతోష్, షిఫ్ట్ ఇన్‌చార్జులు రాయవేని రమేష్, తిరుపతి, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో పెన్నుల పంపిణీ



**హుజురాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సోల్జర్ కి గన్ను... స్టూడెంట్ కి పెన్ను నినాదంతో తెలంగాణ శ్రీనివాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పెన్నుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.చిలుకూరి బాలాజీ సుందరేశ్వర శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారాం మహరాజ్ సత్సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పెన్నులు అందజేసి, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పుట్కూరి శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ శోభారాణి, దేవునూరి శ్రీనివాస్, జక్కుల శ్రీనివాస్, వీణవంక శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## రెడ్డి సంక్షేమ సంఘం సమక్షంలో కార్పొరేటర్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరపాలక సంస్థలో విలీనమైన మల్కాపూర్ గ్రామం 16వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికైన కాంతాల జగన్ రెడ్డిని రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, కాసర్ల జితేందర్ రెడ్డి, కాంతాల ఇంద్రసేనారెడ్డి, గును కుల మహిపాల్ రెడ్డి, కాంతాల బాపురెడ్డి, శ్రీనివాసరెడ్డి, అశోక్ రెడ్డి, శ్యామసుందర్ రెడ్డి, రామ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి కలిసి ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని అందజేశారు.నాయకులు మాట్లాడుతూ, రూరల్ ప్రాంతమైన మల్కాపూర్ గ్రామంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో కృషి చేయాలని కోరారు.

## మహిళల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే




**కరీంనగర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిర్మూలన చట్టం -- 2013 పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లాలో మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపల్ పరిధిలో కమిషనర్లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని, ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలు ఏర్పాటు చేసి మహిళల ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, మున్సిపల్ కమిషనర్లు, సిడిపిఓలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల ఏరివేతపై అసాధ్యం

- చాడ వెంకటరెడ్డి




**కరీంనగర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిపిఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ మావోయిస్టుల నిర్మూలన అసాధ్యమని, కేంద్ర ప్రభుత్వం పెట్టిన డెడ్‌లైన్‌లు పగటి కలలేనని అన్నారు. రాజ్యాంగబద్ధ పాలనను వదిలి నియంతృత్వ ధోరణితో బీజేపీ ప్రభుత్వం దేశంలో అలజడి రేపుతోందని విమర్శించారు.కుమ్మెర ఘటనలో అమాయక చిన్నారి బలి కావడం అగ్రవర్ణ అహంకారానికి నిదర్శనమని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, యాసంగి రైతు భరోసా ఇప్పటికీ ఖాతాల్లో జమ కాకపోవడం దారుణమని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, భూభారతి పథకం అమలు, కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మత్తులు వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఏఐఎఫ్‌బి పార్టీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్ నియామకం




**పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా కొలిపాక శ్రీనివాస్‌ను నియమించినట్లు రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి ప్రకటించారు. ఈ నియామకం తక్షణ ప్రభావంతో అమల్లోకి వచ్చినట్లు తెలిపారు.జిల్లాలో పార్టీ బలోపేతం లక్ష్యంగా ఈ బాధ్యతలు అప్పగించామని, మండల, పట్టణ, గ్రామ స్థాయి కమిటీలను సమన్వయం చేసి పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై ఆందోళనలు, ప్రభుత్వ విధానాలపై స్పందన వంటి అంశాల్లో చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు.కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ జిల్లాలో సంస్థాగత బలోపేతానికి కృషి చేస్తానని, యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను పార్టీ వైపు ఆకర్షించేలా కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు.

### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా కన్వీనర్‌గా దేవా భారతి నియామకం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా మహిళా కన్వీనర్‌గా దేవా భారతిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వోరగంటి ఆనంద్ నియామక పత్రాన్ని అందజేశారు.మలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నందుకు గుర్తింపుగా రాష్ట్ర కమిటీ ఈ బాధ్యతలు అప్పగించింది. సంఘం విస్తరణతో పాటు ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. భారతి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీకి, ముఖ్యంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిగల రవీందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కనకం కొమర స్వామి, తోటి ఉద్యమకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

### పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నుగ్గిళ్ల మల్లయ్య



**పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్‌గా నుగ్గిళ్ల మల్లయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు హాజరై, కొత్త పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ముందుగా ఎమ్మెల్యేకు మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, వేదపండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన 36వ వార్డు కౌన్సిలర్ ముస్కాన్ నాజ్ నయ్యర్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కౌన్సిలర్లు వార్డుల్లో తిరిగి ప్రజల సమస్యలు తీర్చాలని, ఫీల్డ్‌లో ఉంటేనే వ్యవస్థ బాగుపడుతుందని అన్నారు. పట్టణ ప్రగతికి అందరూ కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మౌనిక ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ర్యాలీ



**ఆమనగల్లు, ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పట్టణంలో బుధవారం సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో అగ్ర కులస్తుల దాడిలో మరణించిన మౌనిక ఆత్మ శాంతికి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీసీ, ఎస్సీ ,ఎస్టీ, జేఏసీ మరియు ఆమనగల్లు రజక సంఘం, వివిధ కుల సంఘాలు పాల్గొన్నాయి. వివిధ నినాదాలు ఇస్తూ ప్రధాన రహదారిపై ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, నాగిళ్ల జగన్, ఎనుమల రమేష్, సైదులు గౌడ్ ,వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో క్లిష్టమైన ఆపరేషన్లు విజయవంతం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మరోసారి క్లిష్టమైన శస్త్రచికిత్సల నిలయంగా నిలిచింది. 45 ఏళ్ల మహిళకు గర్భసంచిలో ఏర్పడిన 2.5 కేజీల గడ్డను డాక్టర్ రవళిక, డాక్టర్ అనసూయ, డాక్టర్ రామం, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ బృందం విజయవంతంగా తొలగించారు. అలాగే, రానాపూర్ మండలం పాలకుర్తి గ్రామానికి చెందిన 25 ఏళ్ల మహిళకు పిసిఒడి సమస్యతో గర్భధారణ సమస్యలు ఉండగా, లాప్రోస్కోపిక్ పద్ధతిలో ఒవేరియన్ డ్రిల్లింగ్ ఆపరేషన్‌ను డాక్టర్ అమరసింహ రెడ్డి, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ భవాని బృందం విజయవంతంగా నిర్వహించారు. ఈ రెండు ఆపరేషన్లలో వైద్య బృందం చూపిన నైపుణ్యాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు ఇలాంటి సేవలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

## పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వచ్చే నెల 14 నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆమె, విద్యార్థులతో మాట్లాడి పరీక్షలకు సిద్ధం కావాలని, ప్రతిరోజూ పాఠశాలకు హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. మోడల్ పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. వెనుకబడిన సబ్జెక్టులపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని, ప్రత్యేక తరగతులకు హాజరై ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి ఆనందం, ప్రధానోపాధ్యాయులు శోభారాణి పాల్గొన్నారు.


## ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ పరిశీలన



**సిద్దిపేట, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కేంద్రంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బోర్డు మార్గదర్శకాల ప్రకారం అత్యంత పారదర్శకంగా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయేలా చూడాలని చీఫ్ సూపరింటెంట్‌ను ఆదేశించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు అనుమతించరాదని, పూర్తి తనిఖీ అనంతరం మాత్రమే విద్యార్థులను లోపలికి అనుమతించాలని తెలిపారు. సెంటర్ చుట్టూ 144 సెక్షన్ అమలు చేసి, గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## అంకితభావానికి ప్రతీకగా నిలిచిన ఉపాధ్యాయురాలు బుచ్చమ్మ

**-పీఎంశ్రీ జిల్లా పరిషత్ పాఠశాల-కడ్తాలలో భావోద్వేగ వీడ్కోలు**
**-మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మ రెడ్డి**




**కడ్తాల్, ఫిబ్రవరి 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలిగా సేవలందించిన బుచ్చమ్మ గారు ఈ రోజు పదవీ విరమణ పొందినారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆమెకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మ రెడ్డి హాజరై బుచ్చమ్మ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యా రంగంలో బుచ్చమ్మ అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని ఆయన కొనియాడారు. ఆమె బోధన ద్వారా ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థుల పట్ల ప్రేమ, క్రమశిక్షణ, అంకితభావం ఆమె వ్యక్తిత్వానికి ప్రతీకలని అన్నారు. పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమేనని, భవిష్యత్తులో వారి సేవలు విద్యార్థులకు మరియు కడ్తాల్ పాఠశాలలకు ఎల్లప్పుడూ అందించాలని కోరారు. పదవీవిరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా పదవీ విరమణ జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు గోపాల్ నాయక్, ఉపాధ్యాయులు రాధాకృష్ణ రెడ్డి, మల్లయ్య, ధనుంజయ గౌడ్, ఇంద్రా రెడ్డి, కౌసల్య, శ్వేతమాధురి, పద్మమ్మ, భాగ్యమ్మ, సంగీత గ్రామస్తులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొని బుచ్చమ్మ కి అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి సిఫారసుతో ఎస్ డీ ఎఫ్ నిధులు మంజూరు

**. సర్పంచి రాజేశ్వరి**
**. ఉప సర్పంచి విజయ్ రాథోడ్**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మండలం మేడిగడ్డ గ్రామ పరిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎస్ డి ఎఫ్ నిధుల నుంచి రూ. ఐదు లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో బోర్లు వేయడం, అభివృద్ధి పనులకు సర్పంచి రాజేశ్వరి, ఉప సర్పంచి విజయ రాథోడ్ ప్రారంభం చేశారు. గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం, మెరుగు పడనుందని నాయకులు తెలిపారు. పనులతో గ్రామంలో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి మల్లేష్ నాయక్, లక్ష్మణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆమనగల్లు పురపాలక సంఘం తొలి సాధారణ సమావేశం నిర్వహణ





**ఆమనగల్లు, ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగలు పురపాలక సంఘం గౌరవ కౌన్సిల్ తొలి సాధారణ సమావేశం బుధవారం ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్ పర్సన్ గీత, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, వార్డు సభ్యులు పాల్గొని పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో బీ ఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## తెలకపల్లి మండలానికి నూతన ఎమ్మార్వోని నియమించాలి

**-- వార్డు సభ్యుడు కొమ్ము రాకేష్**




**తెలకపల్లి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలకపల్లి మండలానికి గత నెల రోజులుగా ఎమ్మార్వో నియామకం జరగకపోవడం పట్ల మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 10వ వార్డు సభ్యుడు కొమ్ము రాకేష్ మాట్లాడుతూ, "మాజీ తహసిల్దార్ జాకీర్ హుస్సేన్ రిటైర్మెంట్ అయిన తర్వాత ఇప్పటివరకు ఎమ్మార్వో పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ప్రజలు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. వెంటనే నూతన ఎమ్మార్వోని నియమించాలి" అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డపాకుల శివశంకర్, బండారు సంపత్‌కుమార్, శ్రీను, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యానగర్ లో మౌలిక వసతుల కల్పనపై వినతి పత్రం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మున్సిపాలిటీ 9వ వార్డు విద్యానగర్ కాలనీలో అండర్ డ్రైనేజీ, మురికి కాలువలు, సీసీ రోడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 9వ వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్ పర్సన్ గీత, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కు వినతిపత్రం అందజేసి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. త్వరలోనే స్థల పరిశీలన చేసి అవసరమైన చర్యలు చేపడుతామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముక్తాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్‌లో కాంగ్రెస్ శ్రేణుల శిక్షణ సదస్సు

**అచ్చంపేట, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: వికారాబాద్‌లో ఉభయ రాష్ట్రాల డిసిసి అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సేవాగ్రామ్ ఆశ్రమంలో కాంగ్రెస్ శ్రేణులు నూలు వడకడం ద్వారా స్వదేశీ భావాన్ని ప్రతిబింబించారు. మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఖాదీ ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, స్వావలంబన మరియు



గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే దేశాభివృద్ధి సాధ్యమని, యువత ఖాదీ వినియోగాన్ని పెంచాలని, గ్రామీణ వృద్ధులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- సర్పంచ్ బింగి గీత రాములయ్య**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కప్పపహాడ్ గ్రామంలో కామినేని హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బింగి గీత రాములయ్య, ఉప సర్పంచ్ పల్లపు రమేష్ మాట్లాడుతూ, "ప్రజలందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం" అని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్వి అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహించాలి" అని సూచించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు ఉడుతలా జలంధ్ర గౌడ్, ఆలయ చైర్మన్ బూడిద రాజి రెడ్డి, వైస్ చైర్మన్ దొడ్డి సత్తయ్య, మాజీ పాక్స్ డైరెక్టర్ నిట్టు వీరయ్య, మండల నాయకులు జంగలి ఆశీర్వాదం, ఉడుతలా సుధాకర్ గౌడ్, బుట్టి రాములు, నిట్టు శ్రీకాంత్, నిట్టు బాలరాజ్, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, డాక్టర్లు, మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ శిబిరంలో మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై దాదాపు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

# పారదర్శకంగా ఇంటర్ పరీక్షల నిర్వహణ



**కరీంనగర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో ఆమె పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆర్ట్స్ ఢ కామర్స్), ముకరంపురాలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరా వ్యవస్థ, విద్యార్థుల హాజరు, హాల్ టికెట్ల తనిఖీ, బందోబస్తు ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయేలా చూడాలని, మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జవాబు పత్రాల రవాణాకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని, పరీక్షలు పూర్తయ్యేంతవరకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలో 15,389 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, మొదటి రోజు 14,989 మంది పరీక్షలు రాశారు. 400 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ ఘటనలు చోటుచేసుకోలేదు.

# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**ఆమనగల్లు, ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గీత బుధవారం భూమి పూజ చేశారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పత్య నాయక్, సక్రు నాయక్, మణిపాల్, రవి రాథోడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే భూక్యా మురళీ నాయక్




**మహబూబాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 91 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఈ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోంది. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని తెలిపారు. కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత టెలికాం వినియోగదారులకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యం




**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో షేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో, ట్రాయ్ (టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) సిఏజి సభ్యుడు రావూరి ప్రభాకర రావు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1997లో టెలికాం వినియోగదారుల హక్కుల రక్షణ కోసం ట్రాయ్ యాక్ట్ అమల్లోకి వచ్చిందని, ప్రపంచవ్యాప్తంగా భారత్ టెలికాం రంగంలో రెండవ స్థానంలో ఉందని తెలిపారు. వినియోగదారులు ఉత్తమ సేవలు పొందేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. 2006 నుండి మొబైల్ నంబర్ పోర్టబిలిటీ సౌకర్యం అందుబాటులో ఉందని, 2025 నాటికి దేశవ్యాప్తంగా 7 లక్షల గ్రామాల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని వివరించారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫిర్యాదు చేసే విధానాలు, స్పామ్ కాల్స్/ఎస్ఎంఎస్ నియంత్రణపై మార్గదర్శకాలు అందించారు. డిఎండి 3.0 యాప్ డౌన్‌లోడ్ చేసి 1909లో రిజిస్టర్ అయితే స్పామ్ కాల్స్ ఆగుతాయని, సమస్యలుంటే 1980కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సైబర్ క్రైమ్ సంబంధిత వివరాలు, 1930 టోల్ ఫ్రీ నంబర్ గురించి అవగాహన కల్పించారు. యువత సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వార లక్ష్మి, కన్స్యూమర్ క్లబ్ ఇన్‌చార్జి రజిని, బిఎస్ఎన్ఎల్ ఏజిఎం వెంకటేష్, జియో డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు




**ఆమనగల్లు, ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మండల ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆమనగల్లు సీఐ జానకిరామ్ రెడ్డి తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 200 మీటర్ల దూరంలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు.

# గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

**-- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో**



**మహబూబాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలనీ, జ్ఞాన సంపదకు విజ్ఞాన కేంద్రాలుగా నిలుస్తాయని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "గ్రంథాలయాలు భవితకు బంగారు బాట వేసే నిధులు. విజ్ఞాన భాండాగారాలుగా పేరొందిన గ్రంథాలయాలతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు, ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చు. కాబట్టి మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు వసూలు చేసిన గ్రంథాలయ పన్నును ఎప్పటికప్పుడు చెల్లించి అభివృద్ధికి దోహదపడాలి" అని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టీ. శ్రీలత, జిల్లా పౌర సంబంధాల అధికారి రాజేంద్రప్రసాద్, తొర్రూరు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, మరిపెడ మున్సిపల్ కమిషనర్ విజయ్ ఆనంద్, డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ నిరంజన్, రెవిన్యూ ఆఫీసర్ రఘు, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, కేసముద్రం మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ ఆకుల కిషోర్, డిపిఓ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ విక్రమ్, రుద్రారపు వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**వేములపల్లి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ హై స్కూల్‌ను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజన నాణ్యతపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మెస్ ఇన్‌చార్జ్, వంటవారిని మార్చాలని ఆదేశించారు. ఎమ్మెల్యే స్పందనతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సందీప్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ధూళికట్టలో వైభవంగా పోచమ్మ బోనాలు

**ఎలిగేడు, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని ధూళికట్ట గ్రామంలో యాస్వడపల్లి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘానికి చెందిన దాదాపు 40 కుటుంబాల మహిళలు తలపై బోనాలను ఎత్తుకుని, బైండ్లపూజారుల డప్పు, చప్పుళ్ల నడుమ గ్రామంలోని ప్రధాన రహదారివెంట పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి, బోనాలను సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి పోచమ్మ తల్లికి



మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పెంచాల సంపత్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అట్టెపల్లి కనుకయ్య, ఉపాధ్యక్షుడు అట్టెపల్లి నర్సయ్య, కోశాధికారి చౌదరి తిరుపతి, సభ్యుడు కాశెట్టి సుమన్, మహిళలు, చిన్నారులు, యువ సభ్యులు పాల్గొన్నారు.

# హ్యాట్సాఫ్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

-- ఎంఎస్ఎన్ ఫార్మ అధినేత జీవన్ రెడ్డి ప్రశంసలు





**ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పేద విద్యార్థుల చదువుల కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దాతల సహకారంతో నిర్మిస్తున్న నూతన కాలేజ్ భవనాన్ని ఎంఎస్ఎన్ ఫార్మ అధినేత జీవన్ రెడ్డి మంగళవారం సందర్శించారు. భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, "ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న ఈ పని చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉంది. విద్యపై ఆయన చూపుతున్న తపన ఎందరికో స్ఫూర్తిదాయకం" అని ప్రశంసించారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఈ భవనం పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతి రెడ్డి, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందు నాయక్, ముబారక్ అలీ ఖాన్, బెంది రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ, ఫిబ్రవరి 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఫిబ్రవరి 25, నుండి మార్చి 18, 2026 నుండి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లను సమీక్షించడానికి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శరత్ చంద్ర పవార్, IPS, పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, సిసిటి నిఘా మరియు పోలీసుల మోహరింపును ఎస్పీ సార్ పరిశీలించారు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పరీక్షలను సజావుగా మరియు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల చుట్టూ భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 163 (సెక్షన్ 144కి సమానం) అమలులో ఉందని ఎస్పీ సర్ తెలిపారు. కేంద్రాల దగ్గర ప్రజలు గుమిగూడడం ఖచ్చితంగా నిషేధించబడింది. పరీక్షా సమయంలో సమీపంలోని అన్ని జిరాక్స్ మరియు ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేయబడతాయి. పరీక్షా కేంద్రాల లోపల మొబైల్ ఫోన్లు, స్మా వాచీలు, బ్లూటూత్ పరికరాలు మరియు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను ఖచ్చితంగా నిషేధించామని ఎస్పీ సర్ స్పష్టం చేశారు. విద్యార్థులు నియమాలను జాగ్రత్తగా పాటించాలని మరియు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు తెలియజేయాలని మేము పౌరులను అభ్యర్థించాము. ప్రశాంతంగా మరియు విజయవంతంగా అన్ని కేంద్రాలలో తగినంత పరీక్షలు జరిగేలా చూసేందుకు పోలీసు బందోబస్తు, నిఘా బృందాలను మోహరించారు. మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

# గద్దర్ విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయండి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
కల్వకుర్తిలో మర్చి 8 న నిర్వహించ తలపెట్టిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహావిష్కరణ, సభను విజయవంతం చేయాలని విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్, సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ కోరారు. బుధవారం ఆమనగల్లులో విగ్రహావిష్కరణ సభ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఆవిష్కరణ సభకు నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పార్టీ రామకృష్ణ, నాయకులు సుధాకర్, నరసింహ, రజిత, బిక్షపతి,గోపాల్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరింది

-- ఎమ్మెల్యే డా. మురళీ నాయక్



**మహబూబాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ స్పష్టం చేశారు. పట్టణంలోని 1వ వార్డ్ ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన చిర్ర జయమ్మ, భర్త సారయ్య దంపతులు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మించిన కొత్త ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే, గృహప్రవేశం చేసి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. పేదల మొహంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం. ఇచ్చిన మాట నిలబెట్టే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం" అని పేర్కొన్నారు. గత పాలకులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అని చెప్పి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని విమర్శిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్, వైస్ చైర్మన్ సున్నపు సోమయ్య, వార్డ్ కౌన్సిలర్లు దూపటి స్పందన వినయ్, పద్మం ధనలక్ష్మి, ప్రవీణ్ కుమార్, అంబాల శివకుమార్, బానోతు పార్వతి, భాస్కర్, బొల్లు రాజు, గాడిపెల్లి లావణ్య, చరణ్, చిదిరాల అరుణ, జ్ఞానేశ్వర్, పుచ్చకాయల సరిత, జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో ఉచిత న్యాయ సేవల పరిజ్ఞానం

-- అంగన్వాడీలకు పిలుపు



**మహబూబాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవల పరిజ్ఞానాన్ని గ్రామస్థాయికి తీసుకువెళ్లడంలో అంగన్వాడీలు వారధులుగా పనిచేయాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ డి. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సమగ్ర శిశు అభివృద్ధి పథకం కార్యాలయంలో సీడీపీఓ శిరీష ఆధ్వర్యంలో నాలుగు మండలాల అంగన్వాడీలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "గ్రామాల్లో ప్రజలకు చేరువగా ఉండే అంగన్వాడీలు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉంటే బాధితులకు సరైన దిశానిర్దేశం చేయగలరు. చట్టాలపై అవగాహన హక్కులను రక్షించుకోవడానికి, అన్యాయాన్ని ఎదుర్కోవడానికి, ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడానికి సహాయపడుతుంది. రాజ్యాంగం పట్ల గౌరవం, చట్టాలను పాటించడం ద్వారా న్యాయ సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది వై. చెన్న మల్లారెడ్డి మాట్లాడుతూ, "గ్రామీణ స్థాయిలో మహిళలు, పిల్లల ఆరోగ్యం, విద్యా విషయాల్లో అంగన్వాడీలు అందిస్తున్న సేవలు అభినందనీయమైనవి. కోర్టుల చుట్టూ తిరగకుండా మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించాలి" అని సూచించారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజ్‌కృష్ణ మాట్లాడుతూ, "జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సామాన్యులకు అందే ఉచిత న్యాయ సేవలు ప్రతి ఒక్కరికీ ఉపయోగపడతాయి" అని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, మహిళా సాధికారత సంఘాలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని: ఎస్పీ శరత్ చంద్ర పవార్





**నల్లగొండ,ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
"అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా చొరవలో భాగంగా, తెలంగాణ పోలీసులు మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సురక్షితమైన డ్రైవింగ్ పద్ధతులను ప్రోత్సహించడానికి డ్రైవర్లకు ప్రత్యేక ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సురక్షితమైన డ్రైవింగ్‌కు స్పష్టమైన దృష్టి చాలా కీలకమని, ప్రమాదాలను నివారించడానికి ప్రతి డ్రైవర్ కాలానుగుణంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ నొక్కిచెప్పారు. నిపుణులైన నేత్ర వైద్యులు దృష్టి పరీక్షలు, రంగు దృష్టి స్క్రీనింగ్, కంటి పీడన పరీక్షలు నిర్వహించి, రాత్రిపూట ప్రయాణించే డ్రైవర్లకు, రాత్రి దృష్టి సమస్యలపై మార్గదర్శకత్వం అందించారు. ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో ఆటో, లారీ, ట్రాక్టర్ మరియు ఇతర వాహన డ్రైవర్లు హాజరై ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. నిర్లక్ష్యం, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్లు మరియు సీట్ బెల్టులు ధరించకపోవడం మరియు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్ వాడకం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని ఎస్పీ సార్ హైలైట్ చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని ఎస్పీ కోరారు. డ్రైవర్లు ప్రయాణానికి ముందు తమ వాహనాలను తనిఖీ చేసుకోవాలని, అలసటతో వాహనం నడపకుండా ఉండాలని మరియు భద్రతా గేర్ వాడకాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో వైద్యులు CPR మరియు ప్రథమ చికిత్స గురించి అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పునరుద్ఘాటిస్తూ, "సురక్షిత ప్రయాణం – సంతోషకరమైన గమ్యం" అనే నినాదంతో సమిష్టి కృషికి పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తామని మరియు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని పాల్గొనేవారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పోలీసు అధికారులు, వైద్య బృందాలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మరియు స్థానిక నివాసితులు పాల్గొన్నారు.

# తీదేడు గ్రామ శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి జాతర వాల్ పోస్టర్ల ఆవిష్కరణ





**- నూతన దక్షిణ మండప నిర్మాణానికి శంకుస్థాపన**

**- ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి,తీదేడు గ్రామ సర్పంచ్ .**

**దేవరకొండ ఫిబ్రవరి 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి,గ్రామ పాలక వర్గం,గ్రామ ప్రజలు అన్నారు.చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల(జాతర) సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.శ్రీ రామలింగేశ్వర స్వామి గుట్ట అభివృద్ధి కోసం దేవాలయం వద్ద దక్షిణ మండపం (హాల్) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం మాట్లాడుతూ,వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు,హోమాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు,అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.వాల్ పోస్టర్లలో బ్రహ్మోత్సవాల తేదీలు,కార్యక్రమాల వివరాలు,ప్రత్యేక సేవల న వ ు య ా ల న ు పొ ం ద ు వ ర ి చ వ ు ని తెలిపారు.భక్తులందరు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొంది శ్రీ భవానీ రామలింగేశ్వర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,ఆలయ అర్చకులు సురభి సత్యనారాయణ శర్మ సోదరులు,మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు,ఉలుపాల శేఖర్ రెడ్డి, సోనగంటి గొవర్ధనాచారి, పి.ఏ.సి.యస్ మాజీ డైరెక్టర్ తిరుమణి పాపయ్య,గ్రామ పెద్దలు మర్రు రామారావు,మోర కిరణ్,అంకం అంజూర,కొర్వి రాధాకృష్ణ ,తిరుమణి వెంకటయ్య,జూలురి శ్రీధర్,మర్రు శ్రీనివాసరావు,కాయితి బచ్చిరెడ్డి,మర్రు సురెందర్ రావు,జెల్ల వెంకటేశ్వర్లు,రాశిక పాండయ్య,నేలపట్ల మురళి,వీరమల్ల వెంకటయ్య,సిమర్ల శ్రీను యాదవ్,బొడ్డు యాదగిరి,రెడ్డి పరమేష్,గంటెల ఆంజనేయులు,ఇడమోని శ్రీను యాదవ్,ఉడుత శంకరయ్య,సివర్ల శంకర్,మెరిక శంకరయ్య,చింతకుంట్ల రాకేష్,వలమోని వెంకటయ్య,బొడ్డు సంతోష్ ,రాశిక శిరీష్,మెండె మల్లయ్య,సందె శంకర్,పంబాల చెన్నయ్య,సందె బిక్షం,కొన్రెడ్డి రాజు,తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్



**నల్లగొండ ,ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

నేటి నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కావడంతో జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, టాయిలెట్స్, తాగునీరు, క్లాక్ రూమ్, ప్రశ్న పత్రాలు, ఆన్సర్ షీట్ల డిపాజిట్, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వారి వెంట తీసుకువచ్చిన పుస్తకాలు, మొబైల్ ఫోన్లు, వాచ్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులన్నింటిని భద్రపరచుకునేందుకు ప్రతి పరీక్ష కేంద్రం వద్ద తప్పనిసరిగా క్లాక్ రూమ్ ఏర్పాటు చేయాలని పునరుద్ఘటించారు.అలాగే అన్ని పరీక్ష కేంద్రాలలో తాగునీటితోపాటు, విద్యార్థులకు టాయిలెట్ సౌకర్యం కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్లో నుంచి క్వశ్చన్ పేపర్లను జాగ్రత్తగా బందోబస్తుతోపాటు తీసుకురావాలని, అలాగే ఆన్సర్ సీట్లు సైతం పోలీస్ భద్రతతో డిపాజిట్ చేయాలని చెప్పారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా జిల్లాలో ఎక్కడ మాల్ ప్రాక్టీస్ జరగడానికి వీలులేదని, అంతేకాక విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004251442 నంబర్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**-మంచాల మండలానికి చెందిన 46 మంది లబ్ధిదారులకు రూ.17,49,000ల చెక్కుల అందజేత**



**ఇబ్రహింపట్నం,ఫిబ్రవరి 25( నీలగిరి ఎక్స్ ప్రెస్)** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండలానికి చెందిన 46 మంది లబ్దిదారులకు 17,49,000 రూపాయల విలువైన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత పేదలందరికి సంక్షేమ ఫలితాలు అందుతున్నాయని అన్నారు.ప్రజా సంక్షేమంలో అభివృద్ధి పనులలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ముందువరుసలో ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి , బైరిక రమాకాంత్ రెడ్డి,గుడ్డిమల్ల చంద్రయ్య , మార సురేష్ ,నూకం బాలరాజు ,బుడిగల పరమేష్, దాసరమోని అశోక్ ,రావుల నాగరాజు ,కంబాలపల్లి బుగ్గరాములు ,మారగోని జగన్ గౌడ్ ,కాట్రోత్ మధు ,నవీన్, హరియా, పున్నం సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**ఎలిగేడు, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జ్, ట్రినిటీ విద్యాసంస్థల అధినేత దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎలిగేడు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొని పటాకులు కాల్చి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్‌రావు మాట్లాడుతూ, “దాసరి మనోహర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పెద్దపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వం మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆయన విజయం ఖాయం” అని అన్నారు.కార్యక్రమంలో సుల్తాన్‌పూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, మాజీ సర్పంచ్‌లు కొండయ్య రాజ, స్వప్న కుమార్, లక్ష్మణ్, బిఆర్ఎస్ నాయకులు బద్దం తిరుపతి రెడ్డి, బోయిని సత్యం, కవ్వంపల్లి నారాయణ, శ్రీనివాస్ (బంగ్లా), బాసంపెల్లి రాజేశం, బింగి రాజు, మండల విద్యార్థి సంఘం నాయకులు బాసంపెల్లి వినోద్, శ్రావణ్, సచిన్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాంకేతిక కారణాల వల్ల మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు నిలిపివేత



**పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఈ-నామ్ విధానంలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా బుధవారం పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఆన్‌లైన్ వేలం ప్రక్రియలో ధరలు నమోదు కాకపోవడంతో కొనుగోలు ముందుకు సాగలేదు.మార్కెట్‌కు పత్తి తీసుకొచ్చిన రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ధరలు ఆలస్యంగా రావడం వల్ల సమయం వృథా అవుతోందని, ఆశించినంత ధరలు లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మాట్లాడుతూ సాంకేతిక లోపాన్ని త్వరితగతిన పరిష్కరించి, గురువారం నుండి కొనుగోళ్లు సాధారణంగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బీజేపీ నేత వట్టికోటి జగన్‌ను పరామర్శించిన రాష్ట్ర ఓబీసీ నాయకుడు నారోజు కుమారస్వామి



**ఎల్బీనగర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**


నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం తానెదర్పల్లి గ్రామానికి చెందిన బీసీ నేత, బీజేపీ మండల నాయకుడు వట్టికోటి జగన్ హైదరాబాదులోని ఓంకార్ నగర్ అగస్త్య హాస్పిటల్‌లో గుండెపోటుతో చికిత్స పొందుతున్నారు.మంగళవారం ఆయనను పరామర్శించిన రాష్ట్ర ఓబీసీ నాయకుడు నారోజు కుమారస్వామి చారి, వైద్యుల నుండి ఆరోగ్య పరిస్థితి గురించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గుండె సంబంధిత చికిత్సపై వైద్యులతో మాట్లాడి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అలాగే హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి వీలైనంత వరకు బిల్లును తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా మర్రిగూడ మండల కార్యదర్శి నారగోని యాదగిరి యాదవ్, బండోజు రవి, వట్టికోటి రాజు తదితరులు ఆయనతో కలిసి పాల్గొన్నారు.

# లీగల్ సర్వీస్ చర్యతో ఒడిస్సా వలస కూలీలకు విముక్తి

**-ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ ఫిర్యాదుతో తక్షణమే న్యాయ విచారణ.**


**దేవరకొండ ఫిబ్రవరి 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చింతపల్లి మండల కేంద్రంలోని గొల్లపల్లి గ్రామం పరిధిలో ఎం ఆర్ ఇటుక బట్టీల కంపెనీ లో ఒడిస్సా రాష్ట్రానికి చెందిన 109 వలస కూలీలు పని చేస్తున్నారు, వలస కూలీలు నిత్యం ఇబ్బందులకు గురవుతూ మైనరు పిల్లలు మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నతరుణంలో ఇటికబట్టి సిబ్బంది , కూలీ వారిని హింసిస్తూ కఠిన ఇబ్బందులకు గురి చేస్తున్న ఒక కుటుంబం అక్కడనుండి తప్పించుకొని చిన్నపిల్లలతో నడుచుకుంటూ. కురంపల్లి వారాల పెదరామచంద్రశీ. పొలం మీదుగా వెళుతుండగా



ఎవరు మీరు ఎక్కడ వెళుతున్నారని అడిగి సమస్యను అడిగి తెలుసుకుని వారిని చేర తీసుకొని భోజనం ఏర్పాటు చేసి వారికి కట్టుకోవడానికి వస్త్రాలు ఇచ్చి తనంతరం ఆల్ ఇండియా సమత సైనిక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.బుర్రి వెంకన్నకి సమాచారం ఇవ్వగా ఆయన తక్షణమే నియోజకవర్గ కన్వీనర్ జిల్లా రాములుతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకొని అనంతరం నల్గొండ సఖి టీం వారికి అప్పజెప్పి చింతపల్లి పోలీస్ స్టేషన్లో విషయం తెలియపరచి మరుసటి రోజు వలస కూలీల సమస్యలను,దేవరకొండ సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.అనిత కి ఫిర్యాదు చేయగా తక్షణమే ఆమె ఘటన స్థలానికి చేరుకొని వలస కూలీలను చిన్నారి పిల్లలను దగ్గరికి తీసుకొని వారి సాధకభాద కా లను అడిగి తెలుసుకొని. అక్కడ శ్రమదోపిడి చిన్నారులచే వెట్టిచాకిరి చేయిస్తున్నారని పూర్తి ఆధారాలు సేకరించి తనంతరం వారు వారికి విముక్తి లభించేలా వారిని వారి సొంత రాష్ట్రానికి తరలిం చారు. ఈ విషయం పైన తక్షణమే స్పందించి వారికి విముక్తి కలిగించిన దేవరకొండ న్యాయస్థానానికి సంబంధిత అధికారులు అందరికీ ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ రాష్ట్ర కమిటీ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం




**కరీంనగర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా కరీంనగర్ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు.పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను ఆయన పరిశీలించారు. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నిరంతర నిఘా కోసం స్టాటిక్ ఫోర్స్‌ను కేటాయించామని, పరీక్షలు ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని చెప్పారు.విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలు



**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల భాగంగా ఏవీ కాలేజ్ దోమలగూడ, హైదరాబాద్ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ తెలుగు విభాగంలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలు అనే అంశంపై కవిత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో విజేతలకు శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఉమేష్ కుమార్ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలుగులోకి రావడానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.కవిత్వంలో ప్రథమ బహుమతి కిన్నెర కమల, ద్వితీయ సాయికుమార్, తృతీయ ఎల్. రాఘవ ( ఎం.ఏ తెలుగు రెండవ సంవత్సరం) గెలుచుకున్నారు. వ్యాసరచనలో ప్రథమ మెరుగు ఆకాంక్ష, ద్వితీయ కే. శ్రీలత, తృతీయ సౌమ్య ఎన్. మహేష్ ( ఎం.ఏ ద్వితీయ సంవత్సరం) విజేతలుగా నిలిచారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సతీష్ కుమార్, ఓఎస్డీ హరికాంత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సురేష్, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ పద్మావతి, తెలుగు విభాగం ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, కామర్స్ విభాగం ప్రొఫెసర్ కృష్ణ కుమార్ పాల్గొన్నారు. పోటీలను తెలంగాణ సాహితి జిల్లా ప్రధాన కార్యదర్శి మానవాడ శంకర్, రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు.

# హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్‌కు ఘన సన్మానం



**హుస్నాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన డండి లక్ష్మి కొమురయ్యను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఐదు సంవత్సరాల్లో హుస్నాబాద్ పట్టణాన్ని ఉన్నత స్థాయిలో అభివృద్ధి చేసి ఉత్తమ చైర్మన్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మల్లేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవం

-- హుస్నాబాద్ అసెంబ్లీ స్థాయి పోటీలు




**హుస్నాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రేరణతో, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు మరియు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచన మేరకు సంసద్ క్రీడా మహోత్సవం 2025--26లో భాగంగా హుస్నాబాద్ అసెంబ్లీ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించబడుతున్నాయి.ఎల్కతుర్తి మండల కేంద్రంలో కబడ్డీ, వాలీబాల్, హాకీ, కోకో, అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. ఈ నెల 27లోపు ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. ఫిబ్రవరి 28న డ్రా నిర్వహించి, మార్చి 1 నుండి 3 వరకు హుస్నాబాద్ ప్రభుత్వ క్రీడా మైదానంలో పోటీలు జరుగుతాయి. అసెంబ్లీ స్థాయిలో విజేత జట్లు పార్లమెంటు స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయి. మార్చి 5 నుండి 7 వరకు పోటీలు జరగగా, మార్చి 8న బండి సంజయ్ చేతుల మీదుగా విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేయబడతాయి.ఈ పోటీలకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని, వయసు పరిమితి లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ కోసం మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ (9704646902), చదిరం రాకేష్ (9866126897), ఎం. తిరుపతి (9381130846)ను సంప్రదించవచ్చని తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై జాగృతి నాయకుల విమర్శలు



**కరీంనగర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఘాటుగా విమర్శించారు.కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన దర్నాలో ఆయన మాట్లాడుతూ, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు 2,500 రూపాయలు, కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం, చదువుకునే అమ్మాయిలకు స్కూటీలు, నాలుగు వేల రూపాయల పించను, మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకువస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా అమలు కాలేదని అన్నారు.మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడి చేస్తామని హెచ్చరించారు. బడ్జెట్‌లో అయినా మహిళలకు సంబంధించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, అదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, వరాల శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, ఊలేందుల నరేష్, చంటి శ్రీనివాస్, సంగీత రెడ్డి, జంగ అపర్ణ, ఎండీ సల్మ, ఐలా ప్రసన్న, సంతోషిణి, ఉప్పరి సంగీత, బసవేణి రాజేందర్, శీలం శ్రీనివాస్, హరిష్ శేఖర్, గుండేటి తిరుపతి, గాలిపల్లి రత్నాకర్ చారి, బండ అశోక్, సంతోష్ యాదవ్, బణాల కుమారస్వామి, సబ్బని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసంలో శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో క్రీడా పోటీలు





**అమ్రాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి జాతర బ్రహ్మోత్సవాల ఐదవ రోజు భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు.ఈ రోజు వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లు జరిగి, కోలాట విజేతలకు బహుమతులు అందజేశారు. ముత్యాలమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పణ కార్యక్రమం కూడా జరిగింది.వాలీబాల్ పోటీలను ప్రారంభించి స్వామివారిని దర్శించిన అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, రాయలగండి జాతర నిర్వాహకులు కుందా మల్లికార్జున్, అనిల్ పాండు, క్రీడాభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

# కడ్తాల్ లో కల్తీ పాల కలకళం

రావిచేడ్ గ్రామంలో కల్తి పాలను పట్టుకున్న మహేశ్వరం ఎస్ ఓటి పోలీసులు

కల్తీ పాలను పలు డైరీలకు సరఫరా





**కడ్తాల్, ఫిబ్రవరి 25 ( నీలగిరి ఎక్స్ ప్రేస్**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో కల్తీ పాల కలకళం రేగింది. ఎస్ ఓటి పోలీసులు నిర్వహించిన దాడిలో రావిచేడ్ గ్రామంలో శ్రీశైలం గౌడ్ అనే పాల సేకరణ నిర్వాహకుడు గ్రామంలో పాలసేకరణ ఏజెంట్ గా వ్యవరిస్తున్నాడు. అతను పలు డైరీలకు పాలు విక్రహిస్తాడు. ఏజెంట్ శ్రీశైలం గౌడ్ షాద్ నగర్ లో కల్తీ పాలు తరుచేసే ముడి పదార్థాలు కోనుగోలుచేసి కొన్ని క్యాండ్ల కృతిమ పాలను తయారు చేసి ఆయా డైరీలకు సరఫరా చేయడంతో.. సమాచారం తెలుసుకున్న మహేశ్వరం ఎస్ ఓటి పోలీసులు రావిచేడ్ గ్రామంలో దాడులు నిర్వహించి కృతిమ పాలను గుర్తించారు. పట్టుపడిన పాలను, ఆటోను సిజ్ చేసి కడ్తాల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కడ్తాల్ సిఐ గంగాధర్ తెలిపారు.

# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నూతన రిసెప్షన్, గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు



**కరీంనగర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ మరియు గ్రీవెన్స్ సెల్‌ను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తమ ఫిర్యాదులను నేరుగా అధికారులకు తెలియజేయడానికి ఈ గ్రీవెన్స్ సెల్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఫిర్యాదులను స్వీకరించి నిర్ణీత కాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు, వేధింపులు లేదా ఇతర ఇబ్బందులపై ప్రజలు ఇక్కడ నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. చలాన్ల వివరాలు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన వంటి అన్ని సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రజలు ఈ గ్రీవెన్స్ సెల్ సేవలను వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, భీంరావు, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్ కరీముల్లాఖాన్, ఇతర అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పసిపాప మరణంపై ఆవేదన, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



**అచ్చంపేట, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన పసిపాప మరణం బాధాకరమని ఐఎన్టీయూసీ తాలూకా అధ్యక్షుడు మహబూబ్ అలీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.అచ్చంపేట పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. పాప తల్లిదండ్రులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పోలీసు శాఖ దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, తప్పనిసరిగా శిక్ష పడేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బల్మూర్ మండల అధ్యక్షుడు చందు నాయక్, టౌన్ ఐఎన్టీయూసీ అధ్యక్షుడు గౌస్ పాషా, తాలూకా కార్యదర్శి ఉస్మాన్ వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు మౌలానా, రఘు, రాజు, స్వామి గౌడ్, వెంకటేష్, శ్రీరామ్ నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ



**బల్మూర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని మంగలకుంటపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది.వంశీకృష్ణ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ కొండమోని వెంకటయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మాల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మైసన్న కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు.గ్రామంలో అసైన్డ్ భూమి లేకపోవడంతో గ్రామంలోని దాతలు పొనుగోటి వెంకటేశ్వరరావు, కమలాకర్‌రావు, లక్ష్మణరావు, కొత్త కృష్ణారావు, మధుసూదన్‌రావు తమ తండ్రి కిష్టారావు జ్ఞాపకార్థం నాలుగు గుంటల స్థలాన్ని గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి దానం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రోడ్డ శేఖర్, వార్డ్ సభ్యులు రోడ్డ సుల్తాన్, దండు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సౌదీలో 40 దేశాల కోళ్లు, గుడ్లపై నిషేధం..

### జాబితాలో మన దేశం కూడా..



**న్యూఢిల్లీ : ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అరబ్ దేశం సౌదీ అరేబియా కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 40 దేశాల నుంచి కోళ్లు, గుడ్ల దిగుమతులపై పూర్తి నిషేధం విధించింది. ప్రజారోగ్యం, ఆహార భద్రత వంటి కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సౌదీ వెల్లడించింది. నిషేధించిన దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది.ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆరోగ్య పరిణామాలు, అంటువ్యాధులు వంటి అంశాలను సమీక్షించి ఈ నిషేధం విధించినట్లు సౌదీ ఫుడ్ అండ్ డ్రగ్ అథారిటీ వెల్లడించింది. దాదాపు 40 దేశాల నుంచి పౌల్ట్రీ, గుడ్లపై సంపూర్ణ నిషేధం అమల్లో ఉంటుందని పేర్కొన్నది. ఈ జాబితాలో భారత్‌తో పాటు అఫ్గానిస్థాన్, చైనా, జర్మనీ, ఇండోనేసియా, యూకే, జపాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలు ఉన్నాయి.ఇవేగాక మరో 16 దేశాల్లోని నిర్దిష్ట ప్రాంతాలపై పాక్షిక ఆంక్షలు విధించింది. ఆస్ట్రేలియా, అమెరికా, ఇటలీ, భూటాన్, ఫ్రాన్స్ లాంటి దేశాలపై ఈ పాక్షిక ఆంక్షలు అమలవుతాయని తెలిపింది. అయితే ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వేడి చేసిన పౌల్ట్రీ మాంసం, దాని సంబంధిత ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తించబోదని సౌదీ అధికారులు వెల్లడించారు.

## అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### -- ఎమ్మెల్యే విజయరమణారావు



**ఎలిగేడు, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అభివృద్ధినే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు.జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు బుధవారం ఎలిగేడు మండలం శివపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే విజయరమణారావు వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తాం. నిట్టూరు క్రాసింగ్ నుండి వెంకట్రావుపల్లి, కాచాపూర్ వరకు బీటీ డబుల్ రోడ్డు, కటికనపల్లి నుండి కుమ్మరికుంట, కీచులాటపల్లి వరకు బీటీ రోడ్డు అభివృద్ధి, కాచాపూర్ నుండి పడుకాపూర్, జూలపల్లి వరకు రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమంలో పెద్దపల్లి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతాం" అని తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ప్రతినిధి మారుపాక కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ మారుపాక శ్రీలత, వార్డు సభ్యుడు అక్కపల్లి రవి, బీజేపీ నాయకుడు మహంకాళి వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు కాలువల మల్లయ్య, మహంకాళి అంజయ్య, జల్లి తిరుపతి, మల్లారపు చంద్రయ్య, కాలువల శంకర్, మోయంపల్లి రవి, మహంకాళి పోచమల్లు, కన్నం అనిల్, గాలిపెల్లి అంజయ్య, నరేశ్, కయలేశ్, చిలుక వెంకటేశం, దూట లచ్చయ్య, పుల్లయ్య, గంగారాం, సత్యం, గొల్లె సంపత్, ఎల్లయ్య, దామోదర్, రాజయ్య, సంపత్, సమ్మయ్యతో పాటు దాదాపు వంద మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు.కార్యక్రమంలో పెంట కావేరి కిషోర్, కొండయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ముంబైలో పెరుగుతున్న వాయు కాలుష్యం..

### దిగజారిన గాలి నాణ్యత



**న్యూఢిల్లీ : ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** దేశ రాజధాని ఢిల్లీతో పోటీపడుతూ వాణిజ్య రాజధాని ముంబైలో కూడా వాయుకాలుష్యం పెరిగిపోతోంది. రోజూ గాలి నాణ్యత పడిపోతోంది. ఈ విషయాన్ని తాజా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) నివేదిక తేల్చింది. ఇటీవల ఏక్యూఐ ఏకంగా కొన్నిచోట్ల 300 పాయింట్లు దాటింది. సాధారణంగా 50 లోపు ఉంటే ఆరోగ్యం. 51-100 వరకు ఉంటే ఫర్వాలేదు. కానీ, 100 దాటితే ఆందోళనకరం. అలాంటిది ముంబైలో ఏక్యూఐ వారం రోజులుగా 100 పైనే నమోదవుతోంది.ఈ నెల 17న 123, 18న 78, 19న 153, 20న 318, 21న 259, 22న 240, 23న 190, 24న 250 పాయింట్లుగా నమోదైంది. ఈ తరహాలో వాయు కాలుష్యం శీతాకాలంలో, ఢిల్లీలో నమోదవుతుంటుంది. అయితే, ఇప్పుడు ఇది ముంబైలోనూ మొదలవ్వడం ఆందోళనకరం. సాధారణంగా ముంబైలో చేపల వాసన, సముద్ర నీటి నుంచి వచ్చే ఉప్పు గాలి వంటివి ఇబ్బంది పెడుతుంటాయి. కానీ, ఇప్పుడు అక్కడి ప్రజలు వాయు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టడం, సిటీలో చెత్తను తగలబెట్టడం ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే నిర్మాణ రంగం నుంచి వచ్చే సన్నని ఇసుక, రోడ్లపై నుంచి లేచే మట్టి వంటివి కూడా వాయుకాలుష్యానికి కారణాలు. ముంబైలో బిల్డింగుల కూల్చివేతలు, కొత్తవి నిర్మించడాలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. వీటికి సంబంధించి సిమెంట్, ఇసుక వంటి వ్యర్థాలు గాలిలో ఎక్కువగా కలిసిపోతున్నాయి. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం, వాహనాల కాలుష్యం వంటివి కూడా ముంబైలో గాలి నాణ్యత తగ్గడానికి కారణాలు. ఇక ముంబైలో కాలుష్యం పెరగడంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థానిక బీఎంసీ, ఎన్ఎంఎంసీ అధికారులకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ విషయంలో విఫలమైతే బీఎంసీ, ఎన్ఎంఎంసీ కమిషనర్లకు వేతనాలు ఆపాలని కూడా సూచించింది. వాయు కాలుష్యం ఇంతలా పెరిగిపోతున్నా అరికట్టడంలో విఫలమవుతున్న స్థానిక నాయకత్వం, ప్రభుత్వంపై అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్



**వాషింగ్టన్: ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ రికార్డు క్రియేట్ చేశారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో ఉభయసభలను ఉద్దేశించి ఆయన అతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సుమారు గంటా 50 నిమిషాల పాటు ట్రంప్ మాట్లాడారు. తన ప్రసంగాల్లో ఇదే అతిసుదీర్ఘమైందిగా రికార్డుకెక్కింది. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అత్యధికంగా 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఇప్పుడు ఆ రికార్డును ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఏడాది మార్చిలో కూడా ట్రంప్ సుమారు 100 నిమిషాల పాటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా ఆర్థిక ఎజెండా గురించి ప్రస్తావించారు.ఇక ఇరాన్ అంశంలో వార్నింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఆ సమ్యను దౌత్యం ద్వారా పరిష్కరించేందుకు ఇష్టపడుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ అణ్వాయుధాలను సమీకరిస్తున్న ఇరాన్ వైఖరిని మాత్రం ట్రంప్ ఖండించారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ విరమించుకోవాలన్నారు. అమెరికాను తాకే క్షిపణులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కానీ దీనిపై ఆయన తన ప్రసంగంలో ఎటువంటి ఆధారాలను బయటపెట్టలేదు. యురోప్‌కు ప్రమాదంగా మారే కొన్ని మిస్సైల్స్‌ను ఇప్పటికే ఇరాన్ డెవలప్ చేసిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లను కూడా టార్గెట్ చేసే రేంజ్ ఇరాన్‌కు ఉందన్నారు. ఇక అమెరికా భూభాగానికి చేరుకునే స్థాయికి తగ్గ క్షిపణులను కూడా ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. మిడిల్ ఈస్ట్‌పై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ చేయడం వల్ల.. ఇరాన్‌తో యుద్ధానికి ఆ దేశం సిద్ధం అవుతుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తాము ఇచ్చిన డిమాండ్లను ఒకవేళ ఇరాన్ అంగీకరించకపోతే, అప్పుడు ట్రంప్ అనుకున్నంత పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడి చేశామని, ఆ దాడి వల్ల ఆ దేశ న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్ స్తంభించినట్లు ట్రంప్ చెప్పారు. న్యూక్లియర్ వెపన్ అంశంలో ఇరాన్ ఇంకా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. అణ్వాయుధాలను తయారు చేయమన్న వ్యాఖ్యలు ఇంకా ఇరాన్ నుంచి రావడం లేదన్నారు.

# జోరు పెంచిన రుక్మిణి వసంత్..

## తెలుగులో క్రేజీ ఆఫర్స్ అందుకుంటున్న కన్నడ బ్యూటీ



కన్నడలో సూపర్ హిట్ అయిన సినిమాల్లో సప్త సాగరాలు దాటి సినిమా ఒకటి. ఈ సినిమా తెలుగులోనూ మంచి టాక్ సొంతం చేసుకుంది. ఇందులో రక్షిత్ శెట్టి హీరోగా నటించగా.. కథానాయికగా అందరి దృష్టిని ఆకర్షించింది రుక్మిణి వసంత్.బీర్బల్ సినిమాతో హీరోయిన్ గా తెరంగేట్రం చేసిన ఈ వయ్యారి హిందీలో అప్ స్టైర్స్ అనే సినిమాలో నటించింది. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న ఈ వయ్యారికి ఇప్పుడు సోషల్ మీడియా భారీ ఫాలోయింగ్ వచ్చేసింది. సప్త సాగరాలు దాటి సినిమాతో సౌత్ ఇండస్ట్రీలో ఒక్కసారిగా ఫేమస్ అయ్యింది ఈ హీరోయిన్.ఈ సినిమా ఆమెకు స్టార్ ఇమేజ్ తెచ్చిపెట్టింది. దీంతో తెలుగుతోపాటు కన్నడలోనూ ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. కన్నడలో శ్రీమురళీకి జోడిగా భఘీర చిత్రంలో నటించింది. ఈ సినిమా పర్లేదు అనిపించుకుంది.. అలాగే నిఖిల్ సరసన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో చిత్రంలో నటించింది.ప్రస్తుతం కన్నడ, తెలుగులో మరిన్ని ఆఫర్స్ అందుకుంది. ఇటీవలే తమిళంలో విజయ్ సేతుపతి జోడిగా ఏస్ అనే సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు ఎన్టీఆర్ నటిస్తున్న డ్రాగన్ సినిమాలోనూ ఛాన్స్ దక్కించుకుందని టాక్. ప్రశాంత్ నీల్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా రుక్మిణి తన ఇన్ స్టాలో షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. కవ్వించే కళ్లు.. నిషా చూపులతో చంపేస్తోంది ఈ చిన్నది. ప్రస్తుతం ఈ అమ్మడు ఫోటోలు చూసి ఫిదా అవుతున్నారు ఫ్యాన్స్.




# తమిళంలో హీరోయిన్‌గా టాలీవుడ్ 'బేబి' వైష్ణవి చైతన్య..!

తెలుగులో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన బేబి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది వైష్ణవి చైతన్య. ఈ భామ ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో మరో సినిమా చేస్తూ బిజీగా ఉంది. కాగా ఈ బ్యూటీ ఇక తమిళంలో కూడా తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది.వైష్ణవి చైతన్య, పాపులర్ కోలీవుడ్ కంపోజర్ కమ్ యాక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా తెరకెక్కబోతున్న సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తాజా కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ భామ ఇప్పటికే తమిళంలో అజిత్ కుమార్ నటించిన వలిమైలో కామియో రోల్‌లో మెరిసింది. ఇదే నిజమైతే వైష్ణవి చైతన్యకు తమిళంలో హీరోయిన్‌గా తొలి సినిమా ఇదే కానుంది. మొత్తానికి వైష్ణవి చైతన్య బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తనకంటూ స్పెషల్ ఐడెంటిటీ తెచ్చుకోవాలనే ప్రయత్నంలో బిజీగా ఉన్నట్టు తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. మరి నుంచి రానున్న రోజుల్లో వైష్ణవి చైతన్య నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.

# టాలీవుడ్ ఆఫర్స్ కోసం ఈగర్‌గా ఎదురుచూస్తున్న లవ్ టుడే భామ

లేటెస్ట్ సెన్సేషన్ ఇవానా.. ఈ ముద్దుగుమ్మ చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ మొదలు పెట్టింది. ఆతర్వాత హీరోయిన్ గా మారింది. తమిళ్ లో లవ్ టుడే సినిమాతో పరిచయం అయ్యింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తెలుగులోనూ డబ్ అయ్యి మంచి హిట్ గా నిలిచింది.ఈ సినిమా తర్వాత ఇవానా సింగిల్ సినిమా చేసింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన సింగిల్ సినిమా ఆమధ్య విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో ఇవానా తన అందంతో పాటు నటనతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు ఈ చిన్నదానికి తెలుగులో క్రేజీ ఆఫర్స్ క్యూ కడుతున్నాయి.ఇదిలా ఉంటే గతంలో ఓ ఇంటర్వ్యూలో ఇవానా మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేసింది. చిన్నతనంలో హైట్ విషయంలో చాలా మంది ఏడిపించేవారు అని తెలిపింది. చిన్నప్పుడు నేను హైట్ తక్కువగా ఉండటంతో చాలా అవమానాలు, రిజక్షన్స్ ఎదుర్కొన్నా. స్కూల్‌లో నన్ను ఫ్రెండ్స్ 'పొట్టి' అని ఏడిపించేవారు అని తెలిపింది.వాళ్ల మాటలు చాలా బాధపెట్టేవి దాంతో నేను చదువు పై పెద్దగా దృష్టి పెట్టలేకపోయాను అని తెలిపింది. ఇక చిన్న వయసునుంచే సినిమాల పై ఇంట్రెస్ట్ ఉండేది అని చెప్పుకొచ్చింది. ఇవానాకు తెలుగులో 'హ్యాపీడేస్' అంటే చాలా ఇష్టమట. ఈ సినిమా సాంగ్స్ తన ఫెవరెట్ అని తెలిపింది అని చెప్పుకొచ్చింది.. అలాగే ఫేవరెట్ హీరో అల్లు అర్జున్.ఇక ఈ చిన్నదనికి ఇప్పుడు వరుసగా అవకాశాలు అందుకుంటుంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది తన ఫోటోలతో ఆకట్టుకుంటుంది.






# ఊపేస్తున్న నాని ఆయా షేర్ సాంగ్

ప్రస్తుతం సోషల్ మీడియాలో నేచురల్ స్టార్ నాని 'ఆయాషేర్' మేనియా ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాబోయే చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి విడుదలైన ఈ స్పెషల్ సాంగ్ అటు టాలీవుడ్‌తో పాటు ఇటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌లో రికార్డులను తిరగరాస్తోంది. ఈ పాటలో నాని చూపించిన మాస్ ఎనర్జీ మరియు సిగ్నేచర్ స్టెప్పులు చూస్తుంటే, ఆయన గత పవర్‌ఫుల్ పాత్రల ప్రభావాన్ని కూడా ఇది మించిపోయిందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి 'ఔరా ఆఫ్ ఉస్తాద్' పాట కూడా ఇటీవలే విడుదలైంది. మొదట్లో ఈ పాట ట్రెండింగ్‌లో నిలిచినప్పటికీ, నాని 'ఆయాషేర్' వచ్చిన తర్వాత సీన్ పూర్తిగా మారిపోయింది. విడుదలైన కొన్ని గంటల్లోనే 'ఆయాషేర్' పాట 'ఉస్తాద్'ను వెనక్కి నెట్టి మ్యూజిక్ సెక్షన్‌లో టాప్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో 'ఆయాషేర్ దెబ్బకి ఉస్తాద్ ఔరా గల్లంతయింది' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ అదిరిపోయే సాహిత్యం అందించారు. ఇప్పటికే ఈ పాటపై వేల సంఖ్యలో రీల్స్ వస్తుండగా, సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు అందరూ నాని మాస్ స్టెప్పులను అనుకరిస్తూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది.